# రూల్స్ మహిమ

"అదండీ యిసయం!"

"దరమాసుపత్తిరేనండి..."

"గవాన్మెంటుదండి-"

"పోయిన ఎలచ్చన్ల ముందెట్టేరండి! మరి నేకుంటే వోట్లు ఎయ్యరండి. అంచాత అరజంటుగా ఎట్టేసి వోట్లు ఏయించేసుకున్నారండి"

"తొల్త మొగ డాట్టర్ని ఏసినారు-"

"ఆ బాబు శాన మంచోడు! పగలు నేతిరి యిశచ్చన్నేదు"

"డూటీ ఎక్కినా ఎక్కక పోయినా సూసేవోడండీ!"

"గవాన్మెంటు డాట్టరునా గాదండి!"

"నువు గవాన్మెంటు ఆసుపత్తిరికి ఎల్లండి-"

"ఏటవుద్ది?"

"పేరు వూరు అడగతారండి!"

"వాయసండి"

"మరి ఆడో మొగో సెప్పాలండి"

"నీ రోగవేటో ఎందుకొచ్చిందో అడగతారండి"

"ఇవరాలన్నీ సెప్పాలండి"

"సిట్టాలో ఏసీత్తారండి"

"నువు సొమ్ము వొట్టుగొచ్చినావో నేదో సెప్పాలి"

"నీకాడ సొమ్ముంటే మరి భయం నేదండి"

డాట్టరుబావే నీకు సాయంగా మందేత్తాడండి. నువు వొద్దన్నా సూది మందిత్తాడండి.

కుసీగా కబర్లాడతాడండి"

"నీకాడ సొమ్ము నేదంటే సీటిరాసి సేతలెట్టి అవతల బొమ్మంటాడండి. మరి నీ దిక్కు సూడ్డండి!"

"మరి ఈ బాబు యిసయం ఏరండి?"

"రోగవేటో పూరాగా తనికీసేసి మందిత్తారండి"

"సూది మందియ్యడండి. సేదుమందు యిత్తాడండి. సూది మందుకంటే గునంజాత్తి"

"ఈ డాట్టరుబాబు అన్దరికీ యిరోదమండి! పెద్దోరికండి"

"ముప్పొద్దుల పెసిడెంటుగోరింటి కెల్లాలండి. రోగం వున్నా నేకపోయినా తనికీ సెయ్యాలండి. సెయిర్మెను గోరింటి కెల్లాలండి. పోతే నెంబర్లింటి కెల్లాలండి"

"మరి ఈ బాబు ఎల్లు! నాకాడకొత్తే సూత్తానంటాడండి"

"అదండీ యిరోదం!"

"పెసిడెంటుగోరి కోడలు నెల్దప్పిందండి. పట్నం బొట్టండి"

"నాను మొగ డాట్టరు కాడకెల్ను నేడీ డాక్టరు గావాలందండి"

"మరందేటండి?"

"కన్నారూర్ల యిదికో డాట్టరు! నువు నేడీ డాక్టర్ను తేనేకపోతే కన్నారింటికి ఎల్లిపోతాను తోలీమంది"

"పెసిడెంటుగోరికి సిన్తనం ఏసి తల దీసేసినట్టయిందండి"

"ఈ డాట్టరుబాబు నాబంనేదు పిరాయించేసి నేడీ డాక్టరును అరజంటుగా తోలేమని పిటీషను ఒగ్గేసినాడండి పెసిడెంటుగోరు"

"పెసిడెంటుగోరికి బలగం శానా వుందండి. మూడోనాటికి పిరాయించేసి నారండి"

"నేడీ డాట్టరొచ్చిందండి!"

"సక్కదనాల సుక్కండి! జున్ను ముక్కనాగుంటాదండి! శానా సురుకండి."

"పెద్దానికి సిన్దానికి కూడ సూది మందేసేత్తాదండి"

"ఓ సుట్టు ఏటయిందంటే? అరజంటు డెలివారీ కేసొచ్చిదండి"

"ఎరకయ్య గాడింటి దానికండి"

"పెద్ద పేనం నిలుస్తందా? నిల్దా? బయం ఎట్టేసుకున్నారండి వూర్ల పెజలు డాట్టరమ్మ శానా కట్టబడిందండి" పెద్ద పేనం సిన్న పేనం కాసిందండి"

"అదే టయంలో సెయిర్మెనుగోరికి పెసిడెంటుగోరికి నేడీ డాట్టరు పని పడిందండి"

"డాటరమ్మ ఆసుపత్తిరి కాడ నేదండి"

"బేగొచ్చిమని కబురంపేరండి"

"రానేదు"

"ఒచ్చేక పేసీ ఎట్టేరండి"

"నువు డూటీ టయాంల సెక్కర్లు కొడతన్నావ్ ఈడ పేసెన్టు నొగ్గేసి బైటకెల్లిగూడదు. ఈడకొచ్చినవోర్నే సూడాల. అది రూలు. అన్చెప్పి కూకలేసేరండి"

"నీ రూలేటో నాకు తెల్దు! అరజంట్ కేసయితే పేనంమీదకొత్తే ఎల్లాను. ఎల్లకుండా వొగ్గేమంతావేటి అని నిలదీసిందండి."

"ఏదేటయినా డూటీ టయాంల నువు సెక్కర్లు కొట్టకూడదు. ఈడకొత్తేనే సూడాల కూకలేసినారండి. పెసిడెంటుగోరు, సెయిర్మినుగోరు."

"పెద్దోల్లకున్న రోగడేయిది!" పేదోల్లు సల్లగుంతే సూడ్డేరు. అంచాత ఈల్లి రోగం నానే కుదర్చాలని డూటీ టయాం పెకారం కరకట్టుగా సేసేసిదండి"

"ఓ సుట్టు జామురేతిర్ని పెసిడెంటుగోరి బొట్టికి గొట్టాలమ్మొచ్చిందండి. సెయిర్మినుగోరి కోడలండి. యిరోసినాలు వాంతులు వొగ్గనేదండి. కాల్సేతులు సల్లబడి నేలోడిసినారండి"

"పెసినెంటుగోరు డాట్టరమ్మను అరజంటుగా రమ్మని కబురుతోలేసినారండి"

"నాను డూటీలో నేను రేపు పెందిరికాడే డూటీ ఎక్కేక ఆసుపత్తిరికాడకు వొత్తే సూత్తాను ఎల్లిపోమందండి"

"పేనం నిలదండీ! గడియో సెనమో నాగుందండి"

"అంచాత పెసినెంటుగోరు పెయిర్మినుగోరు డాట్టరమ్మ యింటికి పారొచ్చేసినారండి"

"మీరేసిన రూలే! నానేటి సేసేది అందండి"

"పెసినెంటుగోరు, సెయిర్మినుగోరు తప్పొప్పేసుకొని బొట్టిని రచ్చించమన్నారండి"

"ఆరికప్పుడు దెల్సొచ్చిందండి పేనం యిలువ రూల్సు మగిమ"

"అదండీ యిసయం"

'జనసుధ' వీక్లీ, 9-3-1979